క్లుప్తంగా

నేడు పీస్ కమిటీ సమావేశం

పామూరు: వినాయక చవితి పర్వదినం ఈనెల 27వ తేదీ దృష్ట్యా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నేడు 23వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు పీస్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. సమావేశానికి మండలంలోని పలుగ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్న మండప కమిటీ సభ్యులు విధిగా సమావేశానికి హాజరుకావాలని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై టి.కిషోర్‌బాబు ఉన్నారు.

357 బేళ్ల తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్ కుమార్

కొండపి: స్థానిక పొగాకు కేంద్రంలో నిర్వహించిన వేలంలో 357 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. క్లస్టర్ పరిధిలోని నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 981 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 624 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 357 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.294, కనిష్ట ధర కేజీ రూ.140, సరాసరి ధర కేజీ రూ. 221.14 గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొండపి: శనివావరం ఉదయం 11 గంటలకు స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు నివేదికలతో తప్పనిసరిగా సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు. జెడ్పీటీసీ ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్గొని గ్రామ సమస్యలపై చర్చించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా మండల కమిటీ సభ్యులు

పామూరు: సమాజం, తోటివారి పట్ల ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లూరి రామిరెడ్డి, అధ్యక్షుడు వెండిదండి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. సంస్థ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మండల కేంద్రం పామూరులో శుక్రవారం రాత్రి ప్రపంచశాంతి, పర్యావరణ పరిరక్షణ, మానవత విలువలు, మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ నిషేధం, ఆరోగ్య సంరక్షణ మొదలైన అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తూరెడ్డి వెంకటేశ్వరరావు, మితికాల నారాయణ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నీటి వసతి కల్పనకు చర్యలు



పైప్‌లైన్ పనులు చేయిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలోని 11వ వార్డు టకారిపాలెంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల నీటి సమస్య పరిష్కారానికి చైర్మన్ గఫార్ చర్యలు తీసుకున్నారు. నీటి సమస్యతో పాఠశాలలోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు చైర్మన్‌కు విన్నవించగా తక్షణం స్పందించి బోర్‌వెల్ మరమ్మతులు చేయించారు. అలాగే ప్రత్యేక పైప్‌లైన్ ద్వార నీటి కుళాయి ఏర్పాటుకు శుక్రవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దీవెన, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి



కనిగిరిరూరల్: సెప్టెంబర్ 14న కనిగిరిలో జరిగే సీఐటీయూ మండల 10వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఎస్‌కే పీరావలి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవి కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని తీవ్రంగా దుయ్యబట్టారు. కార్మికుల పక్షాన సీఐటీయూ నిరంతర పోరాటాలు సాగిస్తున్నట్లు చెప్పారు.

మలుపులు.. కాటికి పిలుపులు !

- ఎన్‌హెచ్ 565 రోడ్డు జంక్షన్ పాయింట్లలో కనిపించని సేఫ్టీ వాల్స్
- అధికారిక ప్రారంభానికి ముందే సాగుతున్న వాహనాల రద్దీ
- డేంజర్‌గా ఉన్న మలుపులు, కాలువలు..



కొత్తూరు రోడ్డు మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న కాలువ

కనిగిరిరూరల్:

శరవేగంగా నిర్మాణం జరిగిన కనిగిరి ఎన్‌ఎచ్ 565 రోడ్డులోని కొన్ని ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పట్టణానికి అనుకుని ఉన్న కనిగిరి–కంభం రోడ్డులోని జంక్షన్ పాయింట్, కనిగిరి–పామూరు రోడ్డులోని కొత్తూరు జంక్షన్ పాయింట్‌లు ప్రమాదకరంగా. ఈ రోడ్డును అధికారికంగా ప్రారంభించక పోయినా.. అనధికారికంగా ప్రాథమికంగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

డేంజర్‌గా జంక్షన్ పాయింట్లు..

నేషనల్ హైవే కావడంతో ఇప్పటికే కనిగిరి రూట్‌లో వాహనాల రద్దీ పెరిగింది. ప్రతి నిత్యం వందల సంఖ్యలో కనిగిరి రూట్‌లో తిరిగే వాహనాలు తిరుగుతున్నాయి. పట్టణం లోపలికి వచ్చి వెళ్లాల్సి అవసరం లేని వాహనాలు, వేగంగా పోవాల్సిన వారు దాదాపు హైవే రోడ్డు మార్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కనిగిరి హైవే రెండు జంక్షన్ పాయింట్లలో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోక పోవడం.. మలుపుల్లో సేఫ్టీ వాల్స్, సేఫ్టీ రాడ్స్ ఏర్పాటు చేయక పోవడం.. ప్రమాదపుటంచున ఉన్నాయి. అంతే గాక కంభం రోడ్‌లోని జంక్షన్ పాయింట్‌లో క్రాస్ రోడ్డుకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డులు ఎత్తు పల్లంలో ఉండగా, కొత్తూరు జంక్షన్ పాయింట్ వద్ద కనిగిరి టౌన్‌లో నుంచి వచ్చే ప్రధాన రోడ్డు అప్‌లో ఎక్కాలి.. డౌన్‌లో దిగాలి. ఈరెండు పాయింట్లకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద కాలువలు ఉన్నాయి. దీంతో వాహనం నడిపే డ్రైవర్ కొంచెం కునుకుతీసినా, లేదా వాహనాన్ని కంట్రోల్ చేసుకోలేక పోయినా నేరుగా కాలువల్లో వాహనం పడుతుంది. ప్రధానంగా నిత్యం కనిగిరిలో తిరిగే వాహన దారులు కొంచెం జాగ్రత్తగా ఉన్నా.. బయట ప్రాంతాల నుంచి వచ్చే వాహనదాలు, మద్యం తాగి డ్రైవింగ్ చేసే వాహనదారులు వారు తప్పకుండా ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరిగిన తర్వాత మేలుకోకుండా. హైవే అధికారులు తక్షణం స్పందించి తగు రక్షణ, భద్రతా చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



కొత్తూరు హైవే జంక్షన్ పాయింట్



కంభం రోడ్డు జంక్షన్ పాయింట్‌లతో ప్రమాదకరంగా మలుపు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ గఫార్, ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

బాల్యవివాహాల నివారణ అందరి బాధ్యత

కనిగిరిరూరల్: బాల్య వివాహాలను నివారణ మన అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ గఫార్, ఆర్డీఓ బీ కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీసీ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 పై అవగాహన, వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గూర్చి తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మైనర్ బాలికను వివాహం చేసుకుంటే వరుడు, అతని తల్లి దండ్రులకు, బాలిక తల్లి దండ్రులకు, బంధువులకు ఫోక్సో చట్ట ప్రకారం 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమాన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సుధాకర్‌రావు, హైమావతి, రమేష్ బాబు, దమ్ము వెంకటయ్య, నవకుమార్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ: బహిరంగ ప్రదేశాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు ఇంటి వద్ద నుంచి పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. యాప్‌లో తెలిపిన వివరాలు అన్ని నమోదు చేసిన తరువాత స్థానిక ఎస్సై వచ్చి పరిశీలన జరిపి అంతా సక్రమంగా ఉంటే అనుమతి జారీ చేస్తారన్నారు. ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు. విగ్రహాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్త వహించాలని, రాత్రి వేళ ఒకరిద్దరు వలంటీర్లు బందోబస్తుగా ఉండాలని, విగ్రహ నిమజ్జన పూర్తి సమాచారం తెలపాలని నిబంధనలు వివరించారు. డీజీపీ ఆదేశాల ప్రకారం రౌడీషీటర్ల ఇంటివద్దే కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బీ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలకున్నవారు విధిగా మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశం, వేదిక పై జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, అధికారులు



కొండపిలో గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ



సింగరాయకొండలో విధివిధానాలు తెలియజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్‌బాబు

పామూరు: పంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ పురోగతి సూచిక, ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ బ్రహ్మయ్య మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు గ్రామ ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధికి తక్షణం చేయాల్సిన పనులు, వనరులు, కనీస వసతులు, ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్య, వైద్యం మొదలైన అంశాలపై దృష్టిసారించి ఆయా గ్రామాల అభివృద్ధికోసం పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కే.సుందరరామయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో ఎంపీడీఓ రమణయ్య, ఎంఈఓ జె.ప్రసాదరావులు పంచాయతీల్లో సాధించిన పురోగతిని దృష్టిలో పెట్టుకుని 2025–26 సంవత్సరాలకు పంచాయతీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఎం లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం..

సింగరాయకొండ: గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం ప్రభుత్వం 9 రకాల ప్రణాళికలు సిద్ధం చేసిందని ఇన్‌చార్జి ఎంపీడీవో జీవీ కృష్ణారావు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధిలో భాగంగా పీఏఐ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో ఆర్ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొండపి: ప్రతి గ్రామ పంచాయతీ పురోగతి,సుస్థిరత సాధించేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులకు, సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, మండల్ లెవెల్ అధికారులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అంజలీదేవి, ఏపీఎం గోపీనాథ్, ఏపీఓ వెంకట్రావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలు పురోగతిలో ఉండాలి..

కనిగిరిరూరల్: పంచాయతీల సమగ్రాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, గ్రామ స్థాయి అధికారులు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతి పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కే ప్రభాకర్ శర్మ, తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఏడీఏ ఎస్‌కే జైనులాబ్దిన్, టీఓటీ మల్లికార్జున పాల్గొన్నారు.

మర్రిపూడిలో..

మర్రిపూడి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా శుక్రవారం పంచాయతీ పురోగతి పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు: ఎంపీడీఓ డాక్టర్ సుజాత మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మర్రిపూడిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కాశింపీరా



పామూరులో శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సుజాత

చంద్రబాబువి మోసపూరిత మాటలు



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు రూరల్: ఏ హామీ ఇచ్చిన మోస పూర్తి హామీలేనని నైజమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఈదర వెంకట రమేష్ అన్నారు. మండలంలోని మహదేవపురం గ్రామంలో కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి చంద్రబాబు నాయుడు వచ్చాడన్నారు. గడిచిన కాలంలో ప్రజలున ఎలా మోసం చేశారో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ప్రజలు ఎంత నష్టపోయారో అర్థమవుతుందన్నారు. ఏ పథకం పెట్టిన అరకొరగా ఇస్తూ ప్రజలను నిలువున మోసం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం దివ్యాంగుల పింఛన్ల కూడా రీ వెరిఫికేషన్ పేరుతో తీసివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుళ్లా రోశయ్య, ఓరుగంటి నరశింగరావు, మదన్ మోహన్‌రెడ్డి, పొటికలపూడి రమేష్, మాల్యాద్రి, రఘు, చందలూరి రాము, గంజాపు మాధవ, కందుకూరి శ్రీను, సంగా మాలకొండయ్య, సంగా సుబ్బారావు, కానాటి రామచంద్రయ్య, మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ పవన్, బొల్లిబోయిన వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కందుకూరు : ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీస్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు, సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని దీని కోసం http://ganeshutsav.net వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్ ద్వారా లాగిన్ అవ్వాలి. లాగిన్ అయిన తరువాత దరఖాస్తు ఫారంను పూర్తి చేసి సబ్మిట్ చేయాలన్నారు. ఆ తరువాత పోలీస్‌శాఖ ద్వారా అందించే క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మండపాల వద్ద అంటించాలన్నారు. వినాయక విగ్రహ ప్రతిష్ట కోసం సంబంధిత ఉత్సవ నిర్వాహకులు కమిటీగా ఏర్పడి ఆ వివరాలను పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. మండపాల వద్ద అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని, రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు, బ్యానర్‌లు వంటివి ఏర్పాటు చేయరాదని సూచించారు. అగ్నిమాపక, విద్యుత్‌శాఖల నుంచి అనుమతులు తీసుకుని వారు సూచించిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపాల వద్ద ఉయం 6 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిబంధనల ప్రకారం స్పీకర్లు ఉపయోగించాలని సూచించారు. అలాగే నిమజ్జనం సందర్భంగా జరిగే ఊరేగింపుకు సంబంధించి ముందుగానే పోలీస్‌శాఖకు తెలియజేయాలని, పెద్ద లౌడ్ స్పీకర్లతో డీజెలు ఏర్పాటు, బాణాసంచా వంటివి నిషేధం అని వివరించారు. ఊరేగింపు సందర్భంగా ఎటువంటి రెచ్చగొట్టే కార్యక్రమాలుగాని, అసాంఘిక నృత్యాలు వంటివి చేయడానికి వీలేలేదని స్పష్టం చేశారు. కావున వినాయక ఉత్సవ నిర్వాహకులు పోలీస్‌శాఖ సూచించిన అన్ని నిబంధనలు పాటిస్తూ వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు షేక్ అన్వర్‌బాషా, మంగారావులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు



సీఎస్‌పురంలో పూజలు చేస్తున్న భక్తులు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అర్చకులు పంచాగ్నుల రామమూర్తి ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, ఎం శ్యామ్‌సుందర్‌రాజు ఆధ్వర్యంలో అన్నప్రసాదం, వసతి కల్పించారు. కార్యక్రమంలో సిద్దు రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ దేవస్థానం శ్రావణమాసం సందర్భంగా చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో 2000 మంది మహిళా భక్తులు పాల్గొని వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారని దేవస్థాన ఈవో రమేష్ తెలిపారు.